క్లుప్తంగా

జాతీయ స్థాయి షూటింగ్ బాల్‌పోటీలకు ఎంపిక



మక్తల్: జాతీయ స్థాయి షూటింగ్ బాల్‌పోటీలకు మండలంలోని సంగంబండ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కౌలస్య, కోస్గి మండలంలోని ముశ్రీపా పాఠశాలకు చెందిన విద్యార్థి జగదీష్, ఎలిగండ్ల పాఠశాలకు చెందిన దుర్గా పోటీలకు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ గోపాలం గురువారం విలేకరులకు తెలిపారు. వీరు ఈ నెల 27నుంచి 31వరకు కలకత్తాలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, పీడీలు శ్రీలత, పుష్పలత, రమేష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



ఊట్కూరు: మండలంలోని బాలరాజు గురుస్వామి స్వగృహంలో గురువారం అయ్యప్ప పడిపూజను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, అలంకరణ, పడిపూజను ఘనంగా చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు భగవంత్, రఘువీర్, బాలచందర్, అరవింద్‌కుమార్, హన్మంతు, శుభాష్ తదిరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..



మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి గురువారం బీజేపీలో చేరారు. ఈ మేరకు.. నాగురావు నామాజీ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రతంగ పాండురెడ్డి, నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, రాజేష్, వేణు, శ్రీరాం, రమేష్, వెంకటేష్, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యపరాశ్రీ స్వామికి అరుదైన గౌరవం



ఆదిత్యపరాశ్రీ స్వామిజీ

ఊట్కూరు: బిజ్వార్ అంబత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామికి హిందూ ధర్మప్రచార విభాగం నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డు అందిస్తున్నట్లు గురువారం భక్తులు రమేష్‌గౌడ్, నర్సింహ, మూర్తి తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. హిందూధార్మిక కార్యక్రమాలు విశేషంగా చేపట్టినందుకు ఈ నెల 28న తమిళనాడు రాష్ట్రంలోని కోసూర్‌లోని ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ అవార్డును అందిస్తున్నారని తెలిపారు. గౌరవ డాక్టరేట్ అవార్డు రావడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ చేయూత వర్తింపజేయాలి

అమరచింత: జాబ్‌కార్డు కలిగి ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం చేయూత పథకాన్ని వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారికే చేయూత పథకం వర్తింపచేస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి సంక్షేమ పథకాలను నిరుపేదలకు వర్తించేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇలా నిబంధనల పేరిట పేదల బతుకులను ఆగం చేయకూడదన్నారు. జాబ్‌కార్డు ఉన్నా లేకున్నా, భూమిలేని కుటుంబాలు ఎంతమంది ఉన్నా చేయూత పథకం వర్తింపచేయాలని కోరారు. చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను గ్రామ పంచాయతీ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు.

వెచ్చని నేస్తాలు..

- రోజు రోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత
- రంగురంగులతో ఉలెన్ స్వెటర్లు
- ఆకర్షణీయమైన రూపాల్లో లభ్యం
- నాణ్యత, సైజు ఆధారంగా ధరలు



వివిధ రంగులలో బెడ్‌సీట్లు, రగ్గులు



స్వెటర్లు కొంటున్న వినియోగదారులు

కోస్గి రూరల్: సీతాకాలంలో చలి రోజు రోజుకూ పంజా విసురుతుంది. ఉష్ణోగ్రతలో కూడా అనేక మార్పులు సంతరించుకుంటున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగతుంది. చలి నుంచి ఉపశమనం పొందెందుకు ఉన్ని ఇతర ప్రత్యేక దుస్తులను ప్రజలు ఆశ్రయిస్తున్నారు.

జోరుగా.. అమ్మకాలు

పట్టణంలోని తాండూర్ రోడ్డు ప్రధాన రహదారి ప్రాంతంలో మధ్యప్రదేశ్‌కు చెందిన కుటుంబాలు వచ్చి ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ దుప్పట్లు, స్వెటర్లు, చిన్న, పెద్దవారి మంకి క్యాప్‌లు విక్రయిస్తున్నారు. చలి పెరుగుతుండటంతో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి.

ఆకర్షణీయమైన మోడల్స్..

చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరు చలి నుంచి ఉపశమనం పొందెందుకు చలి స్వెటర్లను ధరిస్తుంటారు. చలికాలం దళసరి దుస్తులు వేసుకోక తప్పదు. పట్టణంలోని స్వెటర్ల దుకాణాల వద్ద పలురకాల స్వెటర్లు, చేతిగ్లౌజ్‌లు, తలకు మంకీక్యాప్‌లు, జర్కిన్‌లు, ఉన్నితోచేసిన దుస్తులు, సాక్స్‌లు అందుబాటులో లభిస్తున్నాయి. చిన్న పిల్లలకు సంబంధించిన వివిధ రకాల ఆకర్షణీయమైన ఉన్ని దుస్తులు లభిస్తున్నాయి. చెవులకు రక్షణగా ఉపయోగించే ఉన్ని దుస్తులు అందుబాటులో ఉన్నాయి.

నాణ్యత ఆధారంగా..

దుస్తుల రకాలు, నాణ్యతలను బట్టి ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. రగ్గులు రూ.700నుంచి రూ.1000 ఆపైన ధరలు ఉండగా.. స్వెటర్లు రూ.400 నుంచి రూ.800ల వరకు, మంకీ క్యాప్‌లు రూ.70 ఆపైన, గ్లౌజులు రూ.70నుంచి రూ.120ల వరకు విక్రయిస్తున్నారు. ఇక పిల్లలకైతే రూ.200 నుంచి రూ.400ల వరకు, మహిళల స్వెటర్లు రూ.350నుంచి 700ల వరకు విక్రయిస్తున్నారు.

మూడు నెలలు ఇక్కడే..



చలికాలం వచ్చిందంటే మధ్యప్రదేశ్, ఢిల్లీ, పానిపట్, లూథియాన నుంచి ప్రత్యేకంగా ఉన్ని దుస్తులు తెచ్చి ప్రతి ఏటా ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నాం. మూడు నెలలుపాటు ఇక్కడే ఉంటాం. హోల్‌సెల్ ధరలకే విక్రయిస్తున్నాం. చలి పెరుగుతుండటంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరుగుతుంది.

- జోర్సింగ్, మధ్యప్రదేశ్

ప్రయాణం ఇబ్బందిగా ఉందని..



పని నిమిత్తం ఉదయం ఇంటి నుంచి 8గంటలకు బయలుదేరి సాయంత్రం 7గంటల తరువాత కోస్గి నుంచి ఇంటికి వెళ్తా. ఈ సమయాన చలికి తట్టుకునేలా స్వెటర్, గ్లౌజులు మొత్తం రూ.700లకు కొన్నా. ద్విచక్రవాహనంపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది.

- నరేష్, సర్జఖాన్‌పేట్

చలికి తట్టుకోలేక..



రాత్రి వేళలో చలి పీక్కు తింటుంది. అందుకే స్వెటర్ రూ.520, రగ్గు రూ.950లకు కొన్నా. సాయంత్రం స్వెటర్ లేకుండా బయటకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. ఉదయం లేచి పని చేసుకోవాలన్నా, బయటకు వెళ్లాలన్నా వెంట స్వెటర్ ఉండాల్సిందే.

- మహేష్, చంద్రవంచ గ్రామం

టోకెన్ సమ్మె విజయవంతం చేయాలి



పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీస్‌ను అందిస్తున్న కార్మికులు

నారాయణపేట: ఈ నెల 27, 28న గ్రామ పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిన్నజట్రం గ్రామ పంచాయతీ భాగ్యలక్ష్మికి పంచాయతీ కార్మికులతో కలిసి టోకెన్ సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు సేవలు అందిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వారికి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, జీఓ నంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన సమ్మెను చేపడుతున్న తెలిపారు. సమ్మెకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఆనంద్, వెంకటేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం



నినాదాలు చేస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

నారాయణపేట: సీపీఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ కార్యాలయంలో కామ్రేడ్ మావో జయంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ చైనాలో మావో కార్మికులు, శ్రామికులు, రైతులు, పీడీత ప్రజలకోసం పోరాటం చేశారన్నారు. కారల్ మార్క్స్ లెనిన్ విధానాన్ని అనుసరిస్తూ పీడిత ప్రజల హక్కుల సాధనకు పోరాటం చేశారని పేర్కొన్నారు. దేశంలో కుల మతాలు లేని సమసమాజాన్ని నిర్మించాలని, కార్మికుల హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం చేసిన మావో విధానాన్ని కార్మిక లోకం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వెంకట్, రాములు, కార్మిక సంఘాల నాయకులు రాములు, ప్రసాద్, శేఖర్, గౌస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ నీటికోసం రైతుల ఎదురుచూపులు




నీరు లేక వట్టిపోయిన కాలువ

మాగనూర్: యాసంగి వరిసాగు చేస్తున్న రైతులు కాల్వనీటి కోసం సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ రైతులు సాగునీరు కోసం ఎదురు చూస్తున్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్న ప్రస్తుతం సాగుచేస్తున్న రైతులకు మాత్రం కాల్వ నీరందడం లేదు. నీరు వదలాలని అధికారులను రైతులు కోరగా సాగునీరు వృథా అవుతున్నాయని అందుకే నీటి విడుదల నిలిపివేశామని చెబుతున్నారు. ఇప్పటికే కొందరు కెనాల్ కింద వరి సాగు చేసుకోగా, మరికొందరు వరి నాటుకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టకు చేరే విధంగా నీటిని కాల్వల ద్వారా విడుదల చేయాలని కోరుతున్నారు.

పక్కా భవనాలు ప్రారంభమయ్యేనా?

కొత్తపల్లి: అద్దె భవనాల్లో కొనసాగుతున్న మండల కార్యాలయాలు పక్కా భవనాల నిర్మాణానికి రూ.8కోట్ల 80లక్షలతో కోడంగల్ పట్టణ కేంద్రంలో డిసెంబర్ 6న రాష్ట్ర మంత్రులచే భూమి పూజలు చేశారు. దాంట్లో భాగంగా నూతన మండలాలుగా ఏర్పడ్డ గుండుమాల్, దుద్యాల్ మండలాలకు కూడా భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలో ఉన్న దుద్యాల్ మండలానికి శాశ్వత భవనాల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు ఎనుముల తిరుపతిరెడ్డి అప్పటి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి భవన నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. జిల్లాలో నూతన మండలాలుగా ఏర్పడ్డ కొత్తపల్లి, గుండుమాల్‌లలో కూడా సమీకృత భవనాలతోపాటు పోలీస్‌స్టేషన్ నిర్మించేందుకు ఆయా మండల కేంద్రాల్లో ఐదు ఎకరాల స్థలాన్ని కూడా సమకుర్చారు. పక్కా భవనాలు నిర్మించేందుకు భూమి పూజలు చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు



కేక్ కట్ చేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: వందేళ్ల నుంచి ప్రజాపక్షాన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. సీపీఐ ప్రారంభమై వందేళ్ల అయినందున మండల కేంద్రంలోని సీపీఐ జెండా కట్టవద్ద గురువారం ఆ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, కర్షక, నిరుపేద వర్గాల పక్షాన ఉంటూ నేటి వరకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నామన్నారు.పేదల పక్షాన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్, మోషు, రఘు, సాలు, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

నారాయణపేట: మక్తల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా వాకిటి శ్రీహరి, అఖిల పక్ష నాయకులు కొండయ్య, సోమశేఖర్‌గౌడ్, కోళ్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నర్వ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు గురువారం వాల్మీకి బోయ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేస్తున్న వినతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చి నప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. డాక్టర్ చెల్లప్ప కమిషన్ నివేదికలో వాల్మీకులను నిజమైన గిరిజనులని పేర్కొన్నారని వారన్నారు. వీరి సమస్యలను సావాధానంగా విన్న మంత్రి, సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు నీరజ్, గడ్డం నర్సింహులు, ఎం.లక్ష్మన్న, కావలి అయ్యన్న, రాములు, ఎర్ర ఆంజనేయులు, కృష్ణ, డీలర్ హన్మంతు ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

మాగనూర్: మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఒక వైపు అధికారులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో భాగంగా అన్నిరకాల అనుమతులను రద్దుచేసి ఇసుక తరలింపును నిలిపివేశారు. మండలంలోని కొందరు ఇదే అదునుగా చేసుకుని ఇసుక తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని పెద్దవాగుతోపాటు గజ్జరందొడ్డి, మందిపల్లి, వర్కూర్, వడ్వాట్ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణాను సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం ఇటువైపు చూడక పోవడంపై పలు అనుమానాలకు దారిస్తుంది.

సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. గురువారం ఏనుగొండలోని నగరకాలనీ, రామకృష్ణకాలనీ, వివేకానందనగర్‌లో పర్యటించారు. కాగా, ఆయా వీధుల్లో మట్టిరోడ్లే శరణ్యమయ్యాయని.. డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, పురుషోత్తం పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న పోలీసులు

నారాయణపేట: ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజు వాహనదారులకు సూచించారు. ప్రజలు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికావొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతోపాటు జైలుకు పంపిస్తామన్నారు.

ఐదు రోజులపాటు గ్రామీణ బ్యాంక్ సేవలు బంద్



మొగులయ్య, బ్యాంక్ మేనేజర్

కోస్గి: గ్రామీణ బ్యాంకులో ఈ నెల 27నుంచి 31వరకు ఐదు రోజులపాటు అన్ని రకాల బ్యాంకు లావాదేవీలు, ఇతర బ్యాంకు సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్థానిక ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ మొగులప్ప పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుస్తుండటంతో సాంకేతికపరమైన మార్పులు, ఇతర కారణాలు, సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ అంశాల దృష్ట్యా బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ రాష్ట్రమంతా ఒకేసారి చేపడుతున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతో 2025 జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో యథావిధిగా బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఖాతాదారులు, వినియోగదారులు అధికారులకు సహకరించాలని సూచించారు.

రైతుల కష్టాలకు ఫలితం లేదు

- ప్రొఫెసర్ హరగోపాల్



రెతును సన్మానిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

మరికల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతుల కష్టానికి ఫలితాలు లేవని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని శ్రీవాణి పాఠశాలలో ఏర్పాటుచేసిన రైతు దినోత్సవం సంబరాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు పండిస్తున్న ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించినప్పుడే రైతులు ధనవంతులు అవుతారన్నారు. రైతుల కష్టాన్ని దొచుకోవడంపై ఉన్న శ్రద్ధ వారి లాభాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. మరోపక్క వ్య వసాయ భూములను పనికి రాకుండా చేసేందుకు కాలుష్యరహితమైన ఇథనాల్ వంటి కంపెనీలను ఏర్పాటుచేసి ప్రజలను, వ్యవసాయాన్ని నాశనం చేస్తున్న ఈ ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. మద్యంపై ఉన్న ఆలోచన ప్రభుత్వానికి రైతులపై లేదని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ ఆలోచనలను పకడ్బందీగా అమలు చేస్తే రైతులు బాగుపడుతారన్నారు. అనంతరం రైతులను సన్మానించి అభినందించారు. శ్రీనివాస్‌శర్మ, లక్ష్మీకాంత్, వెంకటేశ్వర్లు, వినితమ్మ, సంతోష్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి వినతి



మంత్రి బండి సంజయ్‌కు విన్నవిస్తున్న నాయకులు

నారాయణపేట: జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, కృష్ణ వికారాబాద్ రైల్వేలైన్ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామారెడ్డి, గోపాల్ కోరుతూ.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ డీకే అరుణకు గురువారం వినతి పత్రాలను అందజేశారు. జిల్లాలో ప్రధాన రహదారి అయిన మరికల్ నుంచి యాదగిరి వరకు నాలుగు లైన్ల అంతర రాష్ట్రరహదారికి నోచు కోలేదని తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.500కోట్లు కేటాయించాలని కోరారు.

రైతులకు చేరని కేంద్ర పథకాలు..

జిల్లా ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు చేరకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని బీకేఎస్ నాయకులు వెంకోభ మంత్రి బండి సంజయ్‌కు విన్నవించారు.

సైనిక స్కూల్ మంజూరు చేయాలి..

జిల్లాకు సైనిక పాఠశాలను మంజూరు చేయా లని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి విన్నవించారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం

మరికల్: నర్వ మండలం రాయికోడ్‌కు వెళ్తున్న మంత్రి బండి సంజయ్‌కు, ఎంపీ డీకే అరుణకు మండలంలోని లాల్‌కోట చౌరస్తా వద్ద పేట ఆర్డీఓ రాంచందర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం సన్మానించారు.

బ్రిడ్జి ఏర్పాటుచేయాలని వినతి

నర్వ: నీతి అయోగ్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాయికోడ్ గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ.. రాయికోడ్ నుంచి కల్వాల్‌కు వెళ్లే బీటీ రహదారిపై ఫ్లెక్షివర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. వినతి అందించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జయరాములుశెట్టి, స్వామి, ఆంజనేయులుగౌడ్, ఆనంద్ ఉన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని రంగాల్లో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్సా ఇస్లామియా కాషీఫుల్ ఉలుమ్ సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయానికి ప్రజాప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బడ్జెట్‌లో కేటాయించే ప్రతి పైసా నిజమైన లబ్దిదారుడికి చేర్చాలన్నదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. నిబద్ధతతో విద్యాభివృద్ధికి పాటుపడుతున్న సంస్థలకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు కంప్యూటర్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, నూరుల్ హసన్, రఫీక్ పటేల్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు ఉద్ధమ్ సింగ్



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: భారత విప్లవ వీరుడు సర్దార్ ఉద్ధమ్ సింగ్ అని బహుజన మహనీయుల శోభాయాత్ర ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్ కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో ఉద్ధమ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో భారతజాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచి చరిత్రలో ప్రత్యేక స్థానం పొందారన్నారు. 1919 ఏప్రిల్‌లో జరిగిన జలియన్ వాలా బాగ్ మారణకాండలో ఎందరో భారతజాతి బిడ్డల మరణానికి కారకుడైన బ్రిటిష్ అధికార జనరల్ డయ్యర్‌ను హతమార్చి దేశ ధీరత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వీరయోధుడని కొనియాడారు. బ్రిటిష్ పాలకుల గుండెల్లో భయం పుట్టించి విప్లవ వీరుడిగా కీర్తి గడించారని తెలిపారు. జిల్లా కేంద్రంలో సర్దార్ ఉద్ధమ్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, ఉస్కిళ్ల వెంకట్రాములు, వెంకటస్వామి, సాజిదా సికిందర్, పద్మజ, యాదగిరి, మహేష్, బొర్ర సురేష్, దినేష్, విజయ్ పాల్గొన్నారు.